ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
1
బుధవారం 1 మే 2024





పది ఫలితాల్లో బాలికలదే పైచేయి

- రాష్ట్రంలో 20వ స్థానం సాధించిన జిల్లా
- విద్యార్థులను అభినందించిన ఎంఈవోలు

ఏసీసీ, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో బాలికలే పైచేయిగా సాధించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాకు 20వ స్థానం దక్కింది. జిల్లాలో బాలుర 4748, బాలికలు 4535 మొత్తం 9283 మంది పరీక్షకు హాజరు కాగా 8579 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన వారిలో బాలురు 4338 మంది, బాలికలు 4242 మంది ఉన్నారు. బాలురలో ఉత్తీర్ణత 91.36 శాతం, బాలికల్లో ఉత్తీర్ణత 93.52 శాతం మొత్తం ఉత్తీర్ణత 92.42 శాతం ఉంది.

జిల్లాలో మూడు ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా 69 మంది పరీక్షకు హాజరు కాగా 66 మంది పాస్‌కాగా ఉత్తీర్ణత 95.65 శాతం. ప్రభుత్వ ఆశ్రమ హైస్కూళ్లు 13 ఉండగా 431 మందికిగాను 393 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 91.18 శాతం. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 7 ఉం డగా 206 మంది పరీక్షకు హాజరు కాగా 160 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 77.67 శాతం. కేజీబీవీలు 18 ఉండగా 527 మంది పరీక్షకు హాజరు కాగా 483 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 91.66 శాతం. లోకల్ బాడీ పాఠశాలలు 100 ఉండగా 2948 మంది పరీక్ష రాయగా 2532 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 85.89 శాతం. మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలు 7 ఉండగా 486 మంది పరీక్ష రాయగా 485 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 99.79 శాతం. ప్రైవేటు పాఠశాలలు 78 ఉండగా 3260 మంది పరీక్ష రాయగా 3139 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 96.29 శాతం. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు మోడల్ స్కూల్‌లు 5 ఉండగా 469 మంది పరీక్ష రాయగా 443 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 94.46 శాతం. గురుకుల పాఠశాల ఒకటికిగాను 59 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 9 ఉండగా 677 మంది పరీక్ష రాయగా 668 మంది ఉత్తీర్ణులయ్యారు. 98.67 శాతం ఉత్తీర్ణత. జిల్లాలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు 188 మంది ఉన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు 71 కాగా, లోకల్ బాడీ పాఠశాలలు 21, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలు 5, ప్రైవేటు పాఠశాలలు 29, మైనార్టీ గురుకుల పాఠశాలలు 2, మోడల్ పాఠశాలలు 2, గురుకుల పాఠశాల 1, కేజీబీవీ 3, ఎయిడెడ్ పాఠశాల 1, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు 4, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు మూడు ఉన్నాయి.

చెన్నూరు: చెన్నూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని తుమ్మల యశస్విని పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించింది. విద్యార్థినిని ఎంఈవో రాధాకృష్ణ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కొమ్మెర, సుద్దాల గ్రామాల్లోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. 74 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. అల్లాటి వినయ్, బొల్లం అభినయ్, జశ్వంత్, వినిల్‌కుమార్, ప్రణయ్‌చరణ్, శశివర్ధన్‌లు 10 జీపీఏ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్, అశోక్, కిరణ్, రాజేష్, ప్రేమలత, విజ య్‌కుమార్, తేజశ్వి, శ్రీలత, రఫీ, అనిరుద్ అభినందించారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించారు. బోడకుంట దీపిక, గొల్ల స్ఫూర్తి 10 జీపీఏ సాధించారు. అలాగే 29 మంది విద్యార్థులు 9.0 నుంచి 9.7 జీపీఏ సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజారామేష్‌లు తెలిపారు.

కోటపల్లి: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తిరుపతిరెడ్డి తెలిపారు. మొత్తం 302 మంది విద్యార్థులకు 236 మంది ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్‌లో 89 మంది విద్యార్థులకు 82 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన పుట్ట హాస్విక 10 జీపీపీ సాధించగా ఇదే పాఠశాలకు చెందిన ఇప్ప శ్రీనిధి, జశ్విత 9.8, రంగు ఆస్గా 9.7 జీపీఏ సాధించారు. మండల టాపర్లుగా నిలిచిన మోడల్ స్కూల్ విద్యార్థులను ఎంఈవో తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీరాంపూర్: సింగరేణి ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను జీఎంలు గురవయ్య, కె. రఘుకుమార్, బి.సంజీవరెడ్డి అభినందించారు. ఎ.లక్ష్మీ ప్రసన్న 10 జీపీఏ, ఎస్.నవ్య 9.8, కె.ఆశ్రిత, కె.అభిజ్ఞసాయినందు, జి.అక్షర 9.7 జీపీఏ మార్కులు సాధించారు. వి.పురుషోత్తమరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మురళీధర్, పి.అరవింద రావు, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాధాకృష్ణ మూర్తి పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ రేడియంట్ హైస్కూల్‌కు చెందిన ఎం.అక్షిత, జె.అక్షయ గౌడ్, జి.మాధవి 10 జీపీఏ, టి.అశ్విత, సిహెచ్.అనూహ్య, బి.మనస్విని, జి.వాసవి 9.8 సాధించగా కరస్పాండెంట్ చెన్నూరి అఖిల, అమన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ రజనీ, ఉపాధ్యాయులు అభినందించారు. తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియంకు చెందిన 20మంది విద్యార్థుల్లో 9 మంది, ఇంగ్లీష్ మీడియంలో 60మంది విద్యార్థుల్లో 52మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాసైన వారిలో ఎస్.చరణ్‌తేజ 10 జీపీఏ, కె. ఆశ్రిత 8.3 జీపీఏ పొందినట్లు పేర్కొన్నారు.

నెన్నెల: పదో తరగతిలో మండల విద్యార్థులు 89 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 204 మంది విద్యార్థులకు ఉన్నత పాఠశాలకు చెందిన వి.స్థితప్రజ్ఞన్ 9.8 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచాడు.

హాజీపూర్: పది ఫలితాల్లో మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యార్థులు మెరుగైన మార్కులు సాధించినట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీదర్ తెలిపారు. జిల్లాలోని 7 ఎంజేపీ పాఠశాలల్లో 486 మంది పరీక్ష రాయగా 485 మంది ఉత్తీర్ణత సాధించారని, 99.79 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు. అలాగే ముల్కల్లలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 44 మంది పరీక్ష రాయగా 44 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో అర్చన 9.8 జీపీఏ సాధించినట్లు తెలిపారు.


శ్రీరాంపూర్‌లో సింగరేణి పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న జీఎం

భీమిని: మండలంలో 4 ఉన్నత పాఠశాలల్లో 94 మంది విద్యార్థులకు 86 మంది ఉత్తీర్ణత సాధించగా 91.48 శాతం నమోదైంది. విద్యార్థులను ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి అభినందించారు. మండల టాపర్లుగా భీమినికి చెందిన బండి ప్రణీత, శశాంత్ 9.3, కేజీబీవీ విద్యార్థిని సుప్రియ 9.3, వీగాం పాఠశాలకు చెందిన శ్రీనితలు 9.3 జీపీఏలు సాధించారు.

భీమారం: జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 77 మంది పరీక్ష రాయగా 76 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆసంపల్లి ఎప్సీబా 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అలాగే కేజీబీవీలో అట్ల రాష్నవి 9.3 జీపీఏ సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది.నర్సింగాపూర్ (బీ)లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 5 మంది పరీక్ష రాయగా అందరూ, భీమారంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో 12 మంది పరీక్ష రాయగా అందరూ పాసయ్యారు. పేర్ల్ ఆఫ్ ఇండియా ప్రైవేటు పాఠశాలలో 8 మందికి 7గురు పాసయ్యారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, కేజీబీవీఎస్‌వో కనకలక్ష్మీ విద్యార్థులను అభినందించారు.

కాసిపేట: పది ఫలితాల్లో మండలంలో 86 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 345 మంది పరీక్ష రాయగా 298 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు. టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలుర పాఠశాలలో లక్ష్మీనివాస్ 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ధర్మారావుపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన వర్షిణి 9.3 జీపీఏ సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. విద్యార్థులను ఎంఈవో అభినందించారు. దేవాపూర్‌లోని బాలికలు, మల్కేపల్లిలోని బాలుర ఆశ్రమ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

దండేపల్లి: పది ఫలితాల్లో మండల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం 362 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 338 మంది ఉత్తీర్ణత సాధించి 95.0 శాతం సాధించినట్లు ఎంఈవో కాసుల రవీందర్ తెలిపారు. మండల టాపర్‌గా పాత మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెందిన అలిశెట్టి సహస్ర 9.8, లింగాపూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన కొప్పుల సాయి శ్రీకర్, ద్వారక ప్రభుత్వ పాఠశాలకు చెందిన శ్రీజ 9.7, పి. సాయిశ్రీ 9. 5 గ్రేడింగ్ సాధించారు. లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అనిలా తెలిపారు.

తాండూర్: పది ఫలితాల్లో మండలంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు. మండలంలో మొత్తం 325 విద్యార్థులు పరీక్ష రాయగా 282 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు సూరం మణి ప్రశాంత్, గుండు నిహిత్ గౌడ్, రాజు, జయంత్‌లు 10 జీపీఏ సాధించారు. జెడ్పీహెచ్‌ఎస్ అచ్చలాపూర్ పాఠశాలకు చెందిన హరిచందన 9.7 జీపీఏ సాధించాడు. తాండూర్‌లోని విద్యాభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు 65 మంది అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సరోజిని తెలిపారు. కుడుక శ్రీరామ్, పెరుగు సాయి విశ్వేశ్వర్, సాయిసిద్దార్థ్‌లు 10 జీపీఏ సాధించినట్లు తెలిపారు. కరెస్పాండెంట్ సుర భి ఆగమరావు, డైరెక్టర్ శరత్‌కుమార్ అభినందించారు.

వేమనపల్లి: మండలంలో మొత్తం 180 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 171 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో తిరుపతిరెడ్డి తెలిపారు. నీల్వాయి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థిని అర్షిన్ భాను 9.7 జీపీఏ సాధించగా మండల టాపర్‌గా నిలువగా నీల్వాయి కేజీబీవీ విద్యార్థిని సంకీర్తన 9.7 జీపీఏ సాధించిందన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. పాఠశాలలోని ఇద్దరు విద్యార్థులు కె. నవదీప్, బి. రిషితవర్మలు 10 జీపీఏ సాధించారు. మొత్తం 98 మంది పరీక్షలు రాయగా అందరూఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి తెలిపారు. మందమర్రిలోని ఎంజేపీ పాఠశాల వంద శాతం ఫలితాలు సా ధించింది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో జాడి పోచయ్య తెలిపారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలోని తవక్కల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 84 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. కొండ్ర సాహితీ 10/10 సాధించింది. ఐదుగు రు విద్యార్థులు 9.8, ముగ్గురు 9.7 సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తవక్కల్ పాఠశాల సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ సన్మానించారు.

కన్నెపల్లి: మండలంలో మొత్తం 130 మంది పరీక్ష రాయగా 121 మంది ఉత్తీర్ణులయ్యారు. కన్నెపల్లి జెడ్పీ ఎస్ ఎస్ పాఠశాల విద్యార్థి గోమసా అభిలాష్ 9.25 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. విద్యార్థులను ప్రధానోపాధ్యా యు లు అభినందించారు.

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశా లకు చెందిన రాథోడ్ ఈశ్వర్ 10 జీపీఏ సాధించగా విష్ణు వర్ధన్, సాయి వర్ధన్ 9.8 జీపీఏ సాధించినట్లు ప్రధానోపా ధ్యాయులు కమలాకర్ తెలిపారు. కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రఘు 9.8 జీపీఏ సాధించగా వంద శాతం ఉత్తీర్ణత సాధిం చినట్లు ఉపాధ్యాయుడు రాజమౌళి తెలిపారు. జన్నారంలోని లిటిల్ హ్యాండ్స్ పాఠశాలలకు చెందిన అభినందన్ తేజ, అఖిల్, కౌశిక్‌లు 10 జీపీఏ సాధించగా మరో ముగ్గురు 9.8, ఆరుగురు 9.7 జీపీపీ సాధించినట్లు పాఠశాల డైరెక్టర్, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ తెలిపారు. స్లేట్ హైస్కూల్‌లోని 9 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా 61 మంది 9.0 జీపీఏ సాధించినట్లు కరెస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.



మిమ్స్ విద్యార్థుల ప్రభంజనం


జశ్విత హసిక హర్షవెండర్ సాయివిలేఖ

ఏసీసీ: పదో తరగతి ఫలితాల్లో మంచిర్యాల పట్టణంలోని మిమ్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మొత్తం 68 మంది పరీక్ష రాయగా ఆరుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. సిరి వైష్ణవి, మైత్రి, హర్షవెండర్, సాయివిలేఖ, హసిక, జశ్వితలు 10 జీపీఏ సాధించారు. 9.8 జీఏపీ సాధించిన విద్యార్థులు ఏడుగురు ఉండగా, 9.7 జీపీఏ సాధించిన విద్యార్థులు నలుగురున్నారు. 9.3 కంటే ఎక్కువ జీపీఏ సాధించిన విద్యార్థులు 34 మంది ఉన్నారు. విద్యార్థులను మిమ్స్ షే, హైస్కూల్ కరెస్పాండెంట్ శ్రీనివాసరాజు, డైరెక్టర్‌లు ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్, హెచ్‌ఎం సంగీత, ఉపాధ్యాయులు అభినందించారు.


బెల్లంపల్లి సీఈవో విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధం

ఏసీసీ, ఏప్రిల్ 30 : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, అనుమతి లేని డీజే, డ్రోన్‌లపై నిషేధం పొడిగిస్తున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి జూన్ 1 వరకు నిషేధం పొడిగిస్తున్నట్లు తెలిపారు.

వాలీబాల్ పోటీలు

తాండూర్, ఏప్రిల్ 30: మాదారం పోలీస్‌స్టేషన్ మైదానంలో ఈ నెల 4, 5 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని సీఐ కుమారస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో తాండూర్, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని యువత పాల్గొనాలని కోరారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు ఎస్‌ఐ 8712656575లో సంప్రదించాలన్నారు.

చోరీల నియంత్రణకు చర్యలు

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 29: వేసవిలో జరిగే దొంగతనాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ శశి ధర్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరా ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కొత్త వ్యక్తుల కదలికలపై సమాచారం అందించాలని తెలిపారు. వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లేటప్పుడు పక్కన వారికి సమాచారం ఇవ్వాలని, ఇంట్లో విలువైన ఆభరణాలు, నగదు బ్యాం కులో దాచుకోవాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిం చాలన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివని

ఏసీసీ, ఏప్రిల్ 30: ఉద్యోగుల సేవలు మరువలేనివని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం జిల్లా సైన్స్ కేంద్రంలో డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్ బొంతల నవీన్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈవో నవీన్‌ను సన్మానించారు.

విద్యార్థి ప్రతిభ

ఏసీసీ, ఏప్రిల్ 30: కాకతీయ యూనివర్శిటీలో సోమవారం నిర్వహించిన అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో మంచిర్యాల మిమ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి డానియెల్ ప్రతిభ కనబర్చి బెంగుళూరులో నిర్వహించనున్న ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌లు అభినందించారు.

నగదు పట్టివేత

దండేపల్లి, ఏప్రిల్ 30: తాళ్ళపేట చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం వాహన తనిఖీలో ఒకరి వద్ద నుంచి రూ. 58, 400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ భూమేష్ తెలిపారు. ఆదిలాబాద్ నుంచి పెద్దపల్లి జిల్లా ధర్మారం వాహనంలో ప్రయాణిస్తున్న ఆదిలాబాద్‌కు చెందిన షేక్ అజర్ వద్ద నుంచి నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

పోరాట స్ఫూర్తినిచ్చే మే డే

- నేడు కార్మిక దినోత్సవం



మంచిర్యాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):కార్మికులను కీర్తించడమే తప్ప వారికున్న చట్టాలు అమలుకు నోచుకోవడం లేదు. కార్మికలోకం పోరాట స్ఫూర్తికి ప్రతీకగా మేడే దినోత్సవాన్ని బుధవారం జిల్లాలో నిర్వహించుకోవడానికి సిద్ధమయ్యారు. ఎర్రజెండా చేతబూని ముందుకు సాగిన పోరాటానికి 138 ఏండ్లు నిండాయి. కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేస్తూ శ్రమదోపిడి నుంచి విముక్తి కావాలన్న తమ లక్ష్యాన్ని గుర్తు చేసుకునే రోజు మేడే.

హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం

'మే' డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. 1886 మే 1న అమెరికాలోని చికాగో పట్టణంలో కార్మికులు 18 గంటల పని దినాన్ని వ్యతిరేకిస్తూ ఎనిమిది గంటల పని కావాలని జరిపిన ప్రదర్శనపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది కార్మికులు బలయ్యారు. ఆ రక్తంలో కార్మికుడి చొక్క ఎర్రజెండాగా ఎదిగింది. మొదట 18 గంటలు 12 గంటలకు ఆ తరువాత 8 గంటలకు చేరుకుంది. చికాగో పోరాటం కంటే ముందే దేశంలో కలకత్తాలో కార్మికులు నిర్దీత పని గంటల కోసం హౌరా రైల్వే స్టేషన్‌లో 1862లో సమ్మె చేశారు. అప్పటి వరకు రైల్వే కార్మికులు 10 గంటలు పని చేసేవారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటంతో అప్పటి నుంచే కార్మికవర్గంలో చైతన్యం మొదలైంది. 1923లో మొదటిసారిగా దేశంలో 'మే' డేను పాటించారు. అప్పటి నుంచి యేటా కార్మికులు ఐక్యంగా 'మే' డేను జరుపుకొంటు న్నారు.

'మే' డే ఏర్పాట్లలో కార్మికులు

అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు సంఘటిత, అసంఘటిత కార్మికులు సన్నద్ధవుతున్నారు. వివిధ రంగాలకు చెందిన కార్మికులతో వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సింగరేణి గనులు, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, హమలీ సంఘం, ఇఫ్టూ, ఐఎన్‌టీయూసీ, కూరగాయల కార్మిక సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ఆయా సంఘాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొననున్నారు.

ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 30: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల అధికారులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆర్డీవో రాములుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని, అధికారులకు అందించిన హ్యాండ్‌బుక్‌ను చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. పోలింగ్ జరిగే 90 నిమిషాల ముందు ఇద్దరు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ ఏజెంట్లు లేనిపక్షంలో ప్రిసైడింగ్ అధికారికి సమాచారం అందించి మాక్‌పోల్ ప్రారంభించాలన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్నికల నిర్వహణపై ఏమైనా అనుమానాలు ఉంటే మాస్టర్‌ట్రైనర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు.


సూక్ష్మ పరిశీలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

సూక్ష్మ పరిశీలకులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవ హరించాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేష్ గుప్తా పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ఎన్‌టీపీసీ రామగుండంలోని ఈడీసీ మిలినీయం హాలులో సూక్ష్మ పరిశీలకులకు ఏర్పాటు చేసిన శిక్షణలో కలెక్టర్ బదావత్ సంతోష్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి హాజరయ్యారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడు తూ మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సమిష్టిగా కృషి చేయాల న్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు మంచిర్యాల జిల్లాలో ప్రత్యేక బృందాలతో పాటు అవసరమైన పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించి ఎన్నికల ప్రవర్తన నియమావళిపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



ప్రలోభాలపై నజర్

- అభ్యర్థుల బ్యాంకు లావాదేవీలపై కన్ను
- రూ. 10 లక్షలు దాటితే లెక్క తప్పనిసరి
- రోజువారీ ఖర్చులపైనా ఆరా..



జైపూర్, ఏప్రిల్ 30: ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం కోసం ఖర్చు చేయడం, ఓటర్లకు నగదు పంపిణీ పేరిట ప్రలోభాలకు గురి చేయడం లాంటి అంశాలపై ఆదాయ పన్ను శాఖ నిఘా సారిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు ఈ శాఖ సిద్ధమవుతోంది.

ముఖ్యంగా నగదు పంపిణీపై ఆదాయ పన్ను శాఖ ప్రజల సహకారాన్ని కోరుతోంది. దీని కోసం ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారి సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుమతాని భరోసాను ఇస్తోంది. ఎన్నికలు ముగిసే వరకు బ్యాంకు లావా దేవీలపై ఐటీ శాఖ నిఘా పెడుతోంది. ముఖ్యంగా రూ.10 లక్షలకు మించి లావాదేవీలు దాటితే పూర్తి వివరాలను అందించాల్సి ఉంటుంది. రోజు బ్యాంకు లావాదేవీలను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా అబ్జర్వర్లను నియమించింది.

బ్యాంకు లావాదేవీలపై ఆరా

వాణిజ్య బ్యాంకులతో పాటు సహకార, ప్రైవేటు బ్యాంకుల లావాదేవీలపై ఐటీ శాఖ ఆరా తీయనుంది. రూ. 10 లక్షల ట్రాన్‌సాక్షన్ నిర్వహించే ఖాతా దారులపై నిఘా పెట్టనుంది. ఇలా అన్ని బ్యాంకులు రోజు రూ. 10 లక్షల ట్రాన్‌సాక్షన్ దాటిన ఖాతాల వివరాలను పరిశీలించి ఆ డబ్బులు ఎవరి ఖాతాలో జమ చేస్తున్నారు అనే అంశాలను ఆదాయ పన్ను శాఖకు వివరించాల్సి ఉం టుంది. దీని కోసం ఆ శాఖ ప్రత్యేకంగా ఓ పరిశీలకున్ని నియమించింది. సదరు పరిశీలకుడు రోజు బ్యాంకు లావాదేవీలన్నింటిని తనిఖీ చేసి అనుమానం ఉన్న ఖాతాలను స్తంభింపజేయడమే కాకుండా వాటి గుట్టును రట్టు చేస్తారు. దీంతో అక్రమ పద్ధతుల్లో నగదు పంపిణీ సాగకుండా అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయి.

రంగంలోకి నిఘా బృందాలు

ఓటర్లను రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రలోభాలకు గురి చేయకుండా ఆదాయ పన్ను శాఖ కఠిన చర్యలు చేపట్టనుంది. పార్టీల సీనియర్ నాయకులు, ద్వితీయశ్రేణి నాయకులకు డబ్బులు పంచే వ్యవహారాలపై నిఘా పెట్టనుంది. ముఖ్యంగా ఆ శాఖలోని టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రస్తుతం అభ్యర్థుల చుట్టూనే కాకుండా రాజకీయ పార్టీల కేడర్ కార్యకలాపాలపై దృష్టి సారిస్తూ చర్యలకు సిద్ధమవుతోంది. కాగా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నగదు పంపిణీపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలతో పాటు అప్పటి సంఘటనలను ఆదాయ పన్ను శాఖ క్రోడీకరిస్తూ తనిఖీలకు రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేస్తుంది. దీని ఆధారంగా ప్రస్తుత ఎన్నికల్లో ఎక్కడెక్కడ తనిఖీలు చేపట్టాలనే అంశంపై ఆ శాఖ కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే నిఘా బృందాలను రంగంలోకి దించి పార్టీల రోజువారీ కార్యకలాపాల పనితీరును పరిశీలిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది నగదు పంపిణీ అధికమయ్యే అవకాశాలు ఉండడంతో ఐటీ అధికారులు ఇక రాజకీయ పార్టీలను నీడలా వెంటాడనున్నారు.

పోలింగ్ స్లిప్పులో కేంద్రం రూట్ మ్యాప్



అవగాహన కరపత్రాలు

దండేపల్లి, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లకు సాంకేతిక హంగులతో ఓటరు స్లిప్పులు అందించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టి ఇంటింటికి స్లిప్పులు పంపిణీ చేస్తోంది. ఓటర్ స్లిప్పులపై ఫొటోలు ముద్రించకుండా క్యూ ఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. పోలింగ్ స్లిప్పులతోపాటు ఓటింగ్‌లో పాల్గొనడానికి సూచనలు చేస్తూ తయారు చేసిన గైడ్ సీవిజిల్‌పై అవగాహన కర పత్రాలను ఇంటింటికి వెళ్లి ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. ఓటరు స్లిప్‌లో ఓటరు వివరాలు, వెనుక భాగంలో ఓటు వేయడానికి వేళ్లేటప్పుడు, వేసే సమయంలో పోలింగ్ కేంద్రంలో పాటించాల్సి అంశాలు, ఈ మ్యాప్‌లో పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది? ఎలా వెళ్లాలి? అనే వివరాలతో స్లిప్పు వెనుక ముద్రించిన మ్యాప్ ఉంది. పట్టణ ప్రాంత వాసులకు మ్యాప్ ఎంతో ఉపయోగపడనుంది.

135 అత్యధిక 10 జీపీఏలతో
'అల్ఫోర్స్' విజయకేతనం

- అత్యుత్తమ బోధనతో అగ్రశ్రేణి ఫలితాలు
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి



విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30: అత్యుత్తమ బోధనతో అగ్రశ్రేణి ఫలితాలను సాధిస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నా రు. మంగళవారం స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ట్రైనిటాట్స్ ప్రాంగణంలో 10వ తరగతి ఫలితాల్లో 10 జీపీఏలతోపాటు అత్యు త్తమ ఫలితాలు సాధించడంపై ఏర్పాటు చేసిన విజయోత్సవ సమావే శానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సంద ర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన 135 మంది విద్యార్థులు 10 జీపీఏలను సాధించి విజయకేతనం ఎగురవేయడం గొప్ప విషయమని అన్నారు. జిల్లాలో అగ్రగామిగా కొనసాగుతూ స్ఫూర్తిదాయకంగా అల్ఫోర్స్ ఫలితాలు నిలుస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. 139 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 113 మంది విద్యార్థులు 9.7 జీపీఏలను సాధించారని అన్నారు. 1140 మంది విద్యార్థులకు గాను 747 మంది విద్యా ర్థులు 9 జీపీఏ ఆపై మార్కులు సాధించడం విశేషమన్నారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్, ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులను, వివిధ విభాగాల్లో ప్రశంసనీయ జాతీయ స్థాయి ర్యాంకులను సాధించామని అన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారికి ఎల్లపుడూ ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు, విజయ పరంపరకు అహర్నిశలు కృషిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి నరేందర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'ట్రినిటి' విజయభేరి

10 జీపీఏ సాధించిన 29 మంది విద్యార్థులు



ట్రినిటి విద్యార్థులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ట్రినిటి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో కంటే ఉత్తమ ఫలితాలను తమ విద్యార్థులు సాధించారని విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థులను అభినందించి వారికి పుష్పగుచ్ఛాలు అందించారు. 29 మంది 10 జీపీఏ, 24 మంది 9.8 జీపీఏ, 40 మంది 9.7 జీపీఏ, 28 మంది 9.5 జీపీఏ, 29 మంది 9.3 జీపీఏ, 28 మంది 9.2 జీపీఏ, 20 మంది 9 జీపీఏ, మరో 243 మంది విద్యార్థులు 9 జీపీఏలోపు తర్వాత సాధించి ప్రతిభను కనబరిచారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎంలు, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కంపు కొడుతున్న మరుగుదొడ్లు

కాసిపేట, ఏప్రిల్ 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆసుపత్రికి వచ్చే మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండేండ్ల క్రితం కొత్తగా నిర్మించిన ఆసుపత్రి భవనం నిర్వహణ లేక మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయని ఆసుపత్రికి వచ్చే వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమ, శుక్రవారాల్లో ఆసుపత్రికి వచ్చే గర్భిణీల పరీక్షలు (ఎఎన్‌సీ)కు సుమారు 50 మంది వస్తుంటారు. దీంతో మరుగుదొడ్లు సక్రమంగా లేక కంపు కొడుతుండడంతో సమీప వాగులోకి వెళ్లాల్సి వస్తుందని గర్భిణీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించే ఆరోగ్య లక్ష్మీ కార్యక్రమానికి వచ్చే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలతో పాటు ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై కాసిపేట మెడికల్ ఆఫీసర్ రవికిరణ్‌ను వివరణ కోరగా నిధుల లేమితో మరుగుదొడ్ల నిర్వహణ ఇబ్బందిగా మారిందని, త్వరగా మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు .

కూలిన వంతెన

పట్టించుకోని అధికారులు


బురదగూడ వంతెనను ఢీ కొని బోల్తాపడిన కెమికల్ లారీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 30: సిర్పూరు నియోజవకర్గంలోని ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోతోంది. వారం రోజుల క్రితం కెమికల్ లోడ్‌తో వస్తున్న లారీ బురుదగూడ వంతెనను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనలో వంతెన సైడ్‌వాల్ పూర్తిగా కూలి పోయింది. అధికారుల విచారణ జరిపి కేసు నమోదు చేశారు. ఈ నష్టానికి ఎవరు పూడుస్తారు..? అధికారులా..? లేక సంబంధిత లారీ యాజమానా...? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయంలో ఆర్ అండ్ బి అధికారులు వంతెనను కూలి పోయిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు. గత నాలుగేళ్ల క్రితం కూడా ఇదే వంతెనను లారీ ఢీ కొట్టడంతో సైడ్‌వాల్ కూలి పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండు నెలల క్రితం అభివృద్ధి నిధులు విడుదల కావటంతో బురుదగూడ వంతెనకు అధికారులు మరమ్మతులను చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం ముడిసరుకు తీసుకెళ్లుతున్న వెదురు బొంబు లారీ గత రెండు నెలల క్రితం కూడా సెంట్రల్‌లైటింగ్ సిస్టం పోల్‌ను ఢీ కొట్టడం వంగి పోయింది. ఇదే మార్గంలో ఉన్న పలు పోల్స్‌ను కూడా గతంలో లోడ్ లారీలు ఢీ కొట్టడంతో పనికి రాకుండా పోయింది. మున్సిపల్ అధికారులు తరుచు ఫిర్యాదులు చేశారు. అయినా కూడా ఎలాంటి మార్పులు రాలేదు. మున్సిపాల్టీలో పట్టణాభివృద్ధి నిధులు విడుదల కావటంతో నూతనంగా సెంట్రల్‌లైటింగ్ స్తంబాలను కొత్తగా మళ్లీ అమర్చారు. వీటితో పాటు పట్టణంలో లోడ్ లారీలతో కూడా రోడ్లు పూర్తిగా గుంతలు తేలుతున్నాయి. దీంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసకుంటున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులతో గత రెండున్నర ఏళ్ల క్రితం ఎస్టీఆర్ చౌరస్తా నుంచి పొట్టి శ్రీరాములు చౌరస్తా వరకు కూడా రూ.1 కోటితో నూతనంగా బీటీ రోడ్డు వేశారు. ప్రజాధనంతో కట్టిన రోడ్లకు, వంతెనలకు రక్షణ లేకుండా పోతోందని ప్రజలు చెబుతున్నారు.

కేసులతోనే సరి..


పూర్తిగా దెబ్బతిన్న సైడ్ వాల్

సిర్పూరు నియోజకవర్గంలో తరుచూ జరుగుతున్న ప్రమాదాలతో ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలుగుతుండటంతో అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తి లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. ఒక వైపు చేసిన అభివృద్ధి పనులు నేలమట్టమవుతుండటం, మళ్లీ ఈ పనులకు నిధులు కేటాయించాలంటే ప్రతిపాదనలకే పరిమితం కావాల్సిన దుస్థితి నెలకొంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలో చోటు చేసుకోకుండా ఉండాలంటే కనీసం అధికారులు వెంటనే స్పందించి లోడ్ భారీ వాహనాలను రానీయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు డిమాండు చేస్తున్నారు. ఈ విషయమై రూరల్ ఎస్సై సోనియను వివరణ కోరగా గత వారం రోజుల క్రితం కెమికల్స్‌లోడ్‌తో కాగజ్‌నగర్‌కు వెళ్లుతున్న లారీ బురదగూడ వంతెనను ఢీ కొట్టిం దన్నారు. ప్రభుత్వ ఆస్తి నష్టం చేకూర్చటంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భారీ లోడ్ వాహనాల విషయంలో కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీజేపీలో చేరిన మాజీ సర్పంచు

కన్నెపల్లి, ఏప్రిల్ 30 : కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచు పుల్లూరి రాజయ్య మంగళవారం బీజేపీ పార్టీలో చేరారు. రాజయ్యకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామయ్య యాదవ్ పాల్గొన్నారు.

పని సమయాన్ని మార్చాలి

ఏసీసీ, ఏప్రిల్ 30: ఎండ తీవ్రంగా ఉన్నందున మున్సి పల్ కార్మికులకు పని గంటల సమయాన్ని మార్చాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ అన్నారు. మంగళవారం కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఉదయం 5 నుంచి 11 గంటల వరకు పని చేయించాలన్నారు.

మండుటెండల్లో గొడుగుల నీడలో...



దండేపల్లి, ఏప్రిల్ 30: మండుటెండలను సైతం లెక్క చేయకుండా వారసంతలో కవర్లు, గొడుగుల సాయంతో చిరు వ్యాపారం సాగిస్తున్నారు. సోమవారం జరిగిన వారసంతలో పలువురు వ్యాపారులు ఇలా గొడుగు నీడలో కూరగాయలు, పండ్లు విక్రయించారు.

ఆదివాసీల మద్దతు.. ఎవరికో?




- ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే..
- సొంత సామాజికవర్గం మద్దతుపై నేతల ధీమా
- అండగా నిలిచిన వారికే మద్దతు ఇస్తామంటున్న ఆదివాసీలు
- సామాజికవర్గాల వారీగా లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు
- లోక్‌సభ పరిధిలో అన్ని పార్టీల చూపు ఆదివాసీల వైపే..

ఆదిలాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ప్రచారంతో ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుతో ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో.. ఆ సామాజిక వర్గం ఓటర్ల మద్దతు ఎవరికన్నది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆదివాసీలనే బలంగా నమ్ముకుంటున్నాయి. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ సీనియర్ నేత కావడంతో ఆయనకు అన్ని నియోజకవర్గాలలో అనుచరులు, పరిచయాలు ఉండడంతో కలిసి వస్తుందని అంతా భావిస్తున్నారు. అలాగే ఆదివాసీ ఉద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించిన బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఆదివాసీల్లో మంచి పట్టు ఉందన్న టాక్ వినిపిస్తోంది. ఇన్నాళ్లు ఉపాధ్యాయురాలిగా పని చేసి కొత్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ సేవా కార్యక్రమాలతో ఆదివాసీలకు మరింత దగ్గరయ్యిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో సుమారుగా లక్షా 50వేలకు పైగా ఆదివాసీ ఓటర్లు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆసిఫాబాద్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్ నియో జకవర్గాల్లోనే ఆదివాసీల ఆధిక్యత ఎక్కువగా కనిపిస్తోంది. నిర్మల్, సిర్పూర్, ముథోల్ నియోజకవర్గాలలో మాత్రం ఆదివాసీల ప్రభావం అంతగా ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అత్యధికంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆదివాసీ ఓటర్లు ఉండగా.. అత్యల్పంగా ముథోల్ నియోజకవర్గంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఆదివాసీల మద్దతు తమకే ఉందని అన్ని పార్టీల అభ్యర్థులు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నా.. గంపగుత్తగా ఏ పార్టీకి ఆదివాసీలు మద్దతునిచ్చే పరిస్థితులు లేవన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

ఎవరి ధీమా వారిదే..

ప్రధాన పార్టీలన్నీ వ్యూహాత్మకంగా ఆదివాసీ అభ్యర్థులను లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిపాయి. దీంతో ఆదివాసీ ఓటర్ల మద్దతుపై ఎవరికి వారే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ గతంలో పార్లమెంట్ సభ్యుడిగా పని చేయడం ఆదివాసీ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించడంతో ఆయనకు ఆదివాసీలు అనుకూలంగా



ఉంటారన్న చర్చ సాగుతోంది. అయితే గోడం నగేష్ ఆదివాసీ ఉద్యమానికి అంటిముట్టనట్లుగా వ్యవహరించడంతో ఆ సామాజికవర్గంలో కొంత అసమ్మతి వ్యక్తమవుతోంది. దీంతో ఆశించిన స్థాయిలో మద్దతు దక్కుతుందో? లేదో?నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఆదివాసీల ఉద్యమంలో ఎంపీ సోయం బాపురావు తర్వాత.. కీలకంగా వ్యవహరించి న బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఆదివాసీలు కొంత అనుకూలమన్న అభిప్రాయాలు కూడా లేకపోలేదు. సమాజం కోసం పాటుపడిన నేతలకు ఎళ్లవేళలా గుర్తింపు ఉంటుందని ఆదివాసీ సంఘాల నేతలు పలుమార్లు ప్రకటించడం దీనికి బలానిస్తోంది. రాజకీయాలకు కొత్తయిన తన సొంత సామాజికవర్గానికి ఏదో చేయాలన్న తపనతో ఉన్న ఆత్రం సుగుణ.. ఆదివాసీల మద్దతుపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. కానీ ఏమేరకు ఆదివాసీల మద్దతును దక్కించుకుంటారో? వేచి చూడాల్సి ఉంది. మొత్తానికి లోక్‌సభ పరిధిలోని ఆదివాసీ ఓటర్లు ఎవరికి పూర్తిగా మద్దతుగా నిలిచే పరిస్థితులు కనిపించడం లేదు. తలో కొంత ఆదివాసీ ఓటర్ల మద్దతును దక్కించుకుని గిరిజనేతరుల ఓట్లతో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆదివాసీల్లో అయోమయం

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతుపై ఆదివాసీల్లో అయోమయం కనిపిస్తోంది. ఎవరికి మద్దతుగా నిలవాలో అర్థంకాని పరిస్థితి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావుకు అండగా నిలిచిన ఆదివాసీలు.. ఈసారి ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరికి మద్దతునిచ్చే విషయంపై స్పష్టతనివ్వడం లేదు. ఆదివాసీ సమాజానికి అండగా నిలిచిన వారికే మద్దతుగా నిలుస్తామని చెబుతున్నా.. అంతర్గతంగా మాత్రం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఆదివాసీ సమస్యలకు పరిష్కారం చూపిన పార్టీలకే అండగా ఉంటామని సంఘాల నేతలు ప్రకటిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆదివాసీ నేతలు అన్ని పార్టీలలో కీలకంగానే వ్యవహరిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. మెజార్టీ ఆదివాసీ ఓట్లను దక్కించుకుని పార్టీలో సత్తా చాటాలన్న ఉద్దేశంతో కొందరు నేతలు ఉన్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో ఇద్దరు మాత్రమే ఆదివాసీ ఎమ్మెల్యేలు ఉన్నారు. అలాగే సిట్టింగ్ ఎంపీ కూడా ఆదివాసే కావడంతో ఎవరికి పూర్తిగా మద్దతునిచ్చినట్లు కనిపించడం లేదు. గెలిచిన తర్వాత ఆదివాసీ సమస్యలకు సరైన పరిష్కార మార్గం చూపుతామని అభ్యర్థులంతా చెబుతున్నా.. చివరికి ఆదివాసీలు ఎవరికి అండగా నిలుస్తారో? అంతుచిక్కడం లేదం టున్నారు. అయితే అభ్యర్థులంతా సామాజికవర్గాల వారీగా ఓట్ల లెక్కలు వేసుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



పాముకాటుతో వృద్ధురాలి మృతి


భూమక్క (ఫైల్)

దండేపల్లి, ఏప్రిల్ 30: మండల కేంద్రానికి చెందిన కామెర భూమ క్క(75) అనే వృద్ధురాలు పాముకాటుకు గురై చికిత్స పొందుతూ సోమ వారం రాత్రి మృతి చెందింది. భూమక్క ఈనెల 27న ఇంట్లో పని చేస్తుం డగా నాగుపాము కాటు వేసింది. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యు లు వెంటనే దండేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు కామెర పోచం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భూమేష్ వెల్లడించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 30: ఉపాధిహామీ కూలీలు వడదెబ్బ తగల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. మంగళ వారం మామిడిగట్టు, ఆదిల్‌పేట, పొన్నారం, సారంగపల్లి గ్రామాల్లో జరు గుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. ఆయన మాట్లాడుతూ పనులు జరిగే చోట నీడ కోసం నెట్ షెడ్లు, నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లోని పనులను పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు హరీష్, హిమబిందు, టెక్నికల్ అసిస్టెంట్ తిరుమల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

బీజేపీకి మాదిగలను ఓట్లు అడిగే హక్కు లేదు


మాట్లాడుతున్న మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌మాదిగ

తాండూర్, ఏప్రిల్ 30: వర్గీకరణ పేరుతో వంచించిన బీజేపీకి మాదిగ లను ఓట్లు అడిగే హక్కు లేదని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్య క్షుడు రేగుంట సునీల్‌మాదిగ అన్నారు. మంగళవారం తాండూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారం లోకి వస్తే వంద రోజుల్లోపే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి గెలిచిన తర్వాత కూడా వర్గీకరణ చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ కూడా వర్గీకరణ చేయకుండా తమ సామాజిక వర్గాన్ని మోసం చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గ కాం గ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకే మాదిగ సామాజిక వర్గం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, శ్రీనివాస్, సమ్మయ్య, నరసింహులు, స్వామి, అశోక్, సంజీవ్, కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను నమ్మిమోసపోవద్దు

జైపూర్, ఏప్రిల్ 30: కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మి ప్రజలు మోసపో వద్దని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గోమాసే పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ లను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోం దన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మోసపూరిత హామీలను ఇస్తుందని, ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలన్నీ ప్రధానీ మోదీ నాయకత్వాన్ని కొనియాడుతున్నాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఒకే కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ టికెట్ కేటా యించడం దళితజాతిని అవమానపర్చడమేనని తెలిపారు. నర్వ మాజీ సర్పంచు దూట రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది బీజేపీలో చేరగా వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దుర్గం అశోక్, పొట్టాల నాగరాజు, రామగిరి శ్రీపతి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలోని కూరగాయల మార్కెట్, కాంటా చౌరస్తా, ఆటో స్టాండ్ ఏరియాల్లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహిం చారు. బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ గోమాసేకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనితరాజులాల్‌యాదవ్, గోవర్ధన్, బాబు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సుగుణను గెలిపించాలి

జన్నారం, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఇందన్‌పల్లి, రేండ్లగూడ, మొర్రిగూడ, టీజీపల్లె, దేవునిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజల కోసం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

చెన్నూరు, ఏప్రిల్ 30: కిష్టంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

రెబ్బెన, ఏప్రిల్ 30: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీ సుకుంటామని జిల్లా వ్యవసా య శాఖ అధికారి మిలింద్‌కుమార్ అన్నారు. మంగవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల స్టాక్‌ను ఎప్పటికప్పుడు బోర్డుపై ఉం చాలన్నారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమ త్తంగా ఉండాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏవో మంజుల సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

కాగజ్‌నగర్, ఏప్రిల్ 30: బీఆర్‌ఎస్ పార్టీలోకి కౌన్సిలర్ కిరణ్, దహెగాం మాజీ జడ్పీటీసీ సభ్యుడు పిల్లల తిరుపతి మంగళవారం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ము న్సిపల్ మాజీ ఛైర్మన్ సద్దాం హుస్సేన్, రాజ్‌కుమార్, వైస్ ఛైర్మన్ రాచ కొండ గిరిష్ పాల్గొన్నారు.

బెజ్జూరులో మద్యం దుకాణం సీజ్

బెజ్జూరు, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని మద్యం దుకాణాన్ని మంగళ వారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో మద్యం దుకాఆణాన్ని సీజ్ చేశా రు. సోమవారం స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా మద్యంను ఎంఆర్‌పీ కంటే అధిక రేట్లకు విక్రయిస్తూ పట్టుబడడంతో షాపు నిర్వహకుడు రాజుపై కేసు నమోదు చేశారు. దీంతో ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు మ ద్యం దుకా ణంను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు హుస్సేన్, మండల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించిన విద్యార్థులతో కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 30: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన జిల్లాకు చెందిన 11 మంది విద్యార్థులను ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌తో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రే సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాను రాష్ట్ర స్థాయిలో 7వ స్థానంలో నిలప డం అభినందనీయమన్నారు. ఈ విజయం సాధనల అధ్యాపకుల కృషి, తల్లితండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందడుగు వేస్తూ వచ్చే సంవత్సరం జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయా లని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వివేక్, నీల్వాయిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్, పక్కన ఎంపీ అభ్యర్థి వంశీ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 30 : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం యాద వ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ ఆధ్వర్యంలో మందమర్రిలోని వివిధ గ్రా మాలకు చెందిన యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 14 సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీవివేక్‌ను భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించాలన్నారు. బీజేపీ, బీ ఆర్‌ఎస్ పార్టీల మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమనపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్య ర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించా లని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కోరారు. నీల్వాయి, గొర్లపల్లి, వేమనపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ప్రచారం నిర్వహిం చారు. ప్రజలు, ఉపాధి కూలీలను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల సంక్షేమం సాధ్యమ వుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా ముందుకు వెళ్దామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలు వురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మె ల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి కలిసికట్టుగా ముందుకు వెళ్లేందుకు అన్ని పార్టీల నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నామన్నారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బొడ్డు నారాయణ, కౌన్సిలర్ దామెర శ్రీను, పోతురాజుల లీల, పలువురు కాంగ్రెస్‌లో చేరా రు. కాంటా చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వ హించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని ప్రజలను కోరారు. పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్యమున్సిపల్ ఛైర్మన్ జక్కుల శ్వేత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏసీసీ: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ జేఏసీ కోకన్వీనర్ కొంగల ప్రజ్యోత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా పాలిం చేది కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తాం


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

దండేపల్లి, ఏప్రిల్ 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలలో ఆగస్టు 15లోపు రైతులకు రూ. 2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. మంగళవారం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన 10 మంది బీఆర్‌ఎస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్ష్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరికం నిర్మూలన కావా లంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల న్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు ఓ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. గడ్డం త్రిమూర్తి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, పార్టీ నాయకులు కందుల అశోక్, బొప్పిడి మురళీకృష్ణ, బండ రాకేష్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో కుటుంబ పాలన నడుస్తోంది


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వెంకటేష్ నేత

ఏసీసీ, ఏప్రిల్ 30: పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గంలో కుటుంబ పాలన నడుస్తోందని పెద్దపల్లి పార్లమెంట్ నియో జకవర్గ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షు డు రఘునాథ్‌తో కలిసి పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరడం తాను తీసుకున్న తప్పుడు నిర్ణయమన్నారు. గ్రూప్ 1 అధికారి గా ఈ ప్రాంతానికి ఏదైనా చేయాలని రాజకీయాల్లోకి వచ్చానన్నారు. బీఆర్ ఎస్‌లో ఉన్న కేంద్రీకృత విధానాల వల్ల ఎంపీగా ఈ ప్రాంతానికి సేవ చేయాలన్న సంక ల్పం నెరవేరలేద న్నారు. బీఆర్‌ఎస్ విధానాలు నచ్చక ఫిబ్రవరిలో కాంగ్రెస్‌లో చేరానన్నారు. కాంగ్రెస్‌లో తనకు అవమానాలు మాత్రమే మిగిలాయన్నారు. దేశ రక్షణ, దేశాభివృద్ధికి ప్రధాని మోదీ చేస్తున్న కృషికి ఆకర్షితుడినై బీజేపీలో చేరినట్లు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పెట్టుబడి దారి కుటుంబ పాలన కొనసాగుతుందని, కాంగ్రెస్ చెప్పేదొకటి చేసేదొకటి అన్నారు.

రైతులను ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

జైపూర్, ఏప్రిల్ 30: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్య క్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో చేపట్టిన రోడ్ షోలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి మాట్లాడారు.

భీమారం: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆవడం క్రాస్‌రోడ్డు నుంచి బస్టాండ్ వరకు నిర్వహించిన రోడ్డుషోలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి మాట్లాడారు.

శ్రీరాంపూర్: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుటుంబంలో ఇప్పటికే రెండు ఎమ్మెల్యే పదవులున్నాయని, మరో ఎంపీ పదవిని పొందేందుకు తహతహలాడుతున్నారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆర్కె 6 గని, ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, యువ నాయకుడు విజిత్ రావు, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విధానాలను ఎండగట్టాలి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 30: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలను నాయకులు, కార్యకర్తలు ఎండగడుతూ ప్రజలకు వివరించాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎంపీ గుణ పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తాను తమ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచన మేరకు బీఆర్‌ఎస్‌లో చేరానని పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళిక


పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు ప్రేంసాగర్‌రావు, వివేక్

ఏసీసీ, ఏప్రిల్ 30: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్స హించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో హాజీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సంస్థ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ ఉత్ప త్తుల మేళాను ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వివేకానందలతో కలిసి ప్రారం భించారు. మంత్రి మాట్లాడుతూ సేంద్రి య వ్యవసాయానికి చేయూతనివ్వడం వల్ల రైతులకు తోడ్పాటుతోపాటు ప్రజ లు ఆరోగ్యంగా ఉంటారన్నారు. త్వర లో సేంద్రియ వ్యవసాయం చేసే రైతు లతో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాలలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. రైతులు పంట మార్పిడి విధానం అవ లంభించడం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగు తుందన్నారు. ఇక్కడే కూరగాయలు, పప్పు దినుసులు పండించాలన్నారు. గోనె శ్యాంసుందర్‌రావు, మున్సిపల్ ఛైర్మన్ ఉప్పలయ్య, జడ్పీటీసీ శిల్పాశ్రీనివాసరావు,వైస్ ఛైర్మన్ వేణు, బొడ్డు శంకర్ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి


సుబ్బారాయుడును సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 30: విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని కలెక్టర్ బదా వత్ సంతోష్ పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో సుబ్బా రాయుడు పదవీ విరమణ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజర య్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరో గ్య శాఖ అధికారిగా సుబ్బారాయుడు తనకు కేటాయించిన విధుల పట్ల నిబద్దతో పనిచేశా రని, వైద్యాధి కారులు, వైద్యులు, సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవే క్షకులు హరిశ్చంద్రారెడ్డి, ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధి కారి అనిత, జిల్లా సంక్షేమా ధికారి చిన్నయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఆర్‌ఎంవో భీష్మ డీఎంహెచ్‌వోను సన్మానించారు. జిల్లా పశువైద్యాధికారి రమేష్, ఆరోగ్యశాఖ కార్యాలయం పర్యవేక్షకుడు విశ్వేశ్వర్‌రెడ్డి, ఆసుపత్రుల పర్యవేక్షకులు సత్యనారాయణ, రవి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల అవస్థలు

- ఇరుకు రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు
- గుండి ప్రధాన రహదారి గుంతలమయం
- పట్టించుకోని అధికారులు


ఇరుకుగా, ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 30: ఆసిఫాబాద్ పంచాయతీ నుంచి జిల్లా కేంద్రంగా మారినప్పటికీ గుంతల రహదారులు, ఇరుకు రోడ్లతో ప్రయా ణికులకు అవస్థలు తప్పడం లేదు. ప్రజల ఇబ్బందులు మాత్రం తప్పడంలేదు. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా ఆసిఫాబాద్ పరిసర ప్రాంతం నుంచి బైపాస్ రోడ్డు వేశారు. మంచిర్యాల వైపు నుంచి వచ్చే వాహనాలు హైవే నుంచి జిల్లా కేంద్రంలోనికి రావడానికి జిల్లా కేంద్రంలోని వాహనాలు హైవేపైకి వెళ్లడానికి పాత రహదారిని ఉపయోగించారు. అయితే హైవేపై వెళ్తున్న వాహనాల వేగం ఎక్కువగా ఉండడం పలుసార్లు జిల్లా కేంద్రంలోనికి వచ్చే రహదారిపై ప్రమాదాలు జరుగడంతో అధికారులు జిల్లా కేంద్రం నుంచి హైవేపైకి వెళ్లడానికి ఉన్న రహదారి మూసివేశారు. గుండి రహదారి ద్వారా బైపాస్ ఉపయోగించి హైవేపైకి వెళ్లడానికి వాహనాలకు అనుమతి ఇచ్చారు. ఇప్పుడు ఇదే జిల్లా కేంద్రంలోని గుండి రహదారిపై నివాసం ఉంటున్న వారికి శాపంగా మారింది.

- బైపాస్ మీదుగా..

జిల్లా కేంద్రం నుంచి గుండి రహదారి ద్వారా బైపాస్ మీదుగా హైవేపైకి వెళ్లడానికి అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే స్థానిక ప్రధాన రహదారి నుంచి బైపాస్ వరకు అప్రోచ్ రహదారి నిర్మించలేదు. దీంతో భారీ వాహనాలు రహదారిపై వెళ్తుండటంతో ఆ ప్రాంతంలో నివసించే వారు దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు. ఇదే ప్రాంతంలో పాఠశాల ఉండటంతో విద్యార్థులకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయందోళనకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు అప్రోచ్ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టడం లేదు. జిల్లా కేంద్రం నుంచి బైపాస్ వరకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారింది. దీంతో వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇదే రహదారిపై నుంచి వాహనాలను మరల్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ కనీసం దానిమీద తట్టెడు మట్టి కూడ పోయక పోవడం అధికారుల అలసత్వానికి అద్దం పడుతోంది. కాగా యూనియన్ బ్యాంకు ఎదుటగల మూల మలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో రోడ్డు చిన్నగా మారింది. దీంతో ప్రధాన రహదారి నుంచి అటువైపు బస్సులు, లారీలు ఇతర పెద్ద వాహనాలు తిప్పడం కూడ కష్టంగా మారిందని డ్రైవర్లు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కనీసం ఆ దిశగా కూడ చర్యలు తీసుకోకపోవడం పట్టణ ప్రజల కష్టాలకు మరింత కారణమైంది.

రహదారి లేక ఇబ్బందులు..



బైపాస్ రోడ్డు నుంచి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి కలిపే వరకు గుండి రహదారి సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందుల పడుతున్నాం. పిల్లలు ఇంట్లో నుంచి బయటకు రావడం కూడ భయంగా తయారైంది. ఈ రహదారి గుండా పెద్ద వాహనాలు రాకుండా చుడాలని గతంలో కలెక్టర్‌కు విన్నవించిన అదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినప్పటికి నేటికి నేరవేరలేదు. భారీ వాహనాలు ఈ రహదారిపై రాకుండా చూడాలి.

- నిమ్మల మహేష్‌గౌడ్, సాయినగర్

రహదారి వెంటనే నిర్మించాలి..



పట్టణంలోని అర్‌అండ్‌బీ రోడ్డు నుంచి బైపాస్ వరకు రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి. ఈ రహదారి గుండా భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. భారీ వాహనాల రాక పోకలతో ఇబ్బందికరంగా మారింది.

- ఐలవేణి సంతోష్, సాయినగర్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుమ్మక్కు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

సిర్పూర్(టి), ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎ స్ పార్టీలు కుమ్మక్కు అయ్యాయని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎంపీ అభ్యర్థి గెడెం నగేష్ తరఫున మండలంలోని చీర్రకుంట, చుచ్చుపల్లి, హీరాపూర్, భూపాలపట్నం, కేశవపట్నం గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటేనని కేంద్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాని మోదీ పాలనలోనే అభివృద్ధి జరిగిందని చెప్పారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మకుండా బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేష్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని కోరారు. ఆయన వెంట నాయకులు శంకర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

- బీజేపీ నాయకుల ప్రచారం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 30: కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ క్యాంపుల్లో మంగళవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజే పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ మాట్లాడుతూ పేదల కోసం ప్రధాని మోదీ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్ర మంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాలిదాస్, అమిత్ బిశ్వాస్, రాకేష్, ఆశుతోష్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట: మండలంలోని ఆగర్‌గూడ గ్రామంలో బీజేపీ నాయకులు మంగళవారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీని మరో సారి ప్రధానిగా చేయాలని కోరారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి మోదీ పథకాలను వివరిస్తూ ఓట్లు అడగుతున్నామని చెప్పారు. ఇంటింటికీ వెళుతున్నామని, ప్రజలకు కేంద్రం అమలు చేసే పథకాలు, నిధులు విడుదలపై వివరిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజన్ననగేష్, సత్తన్న, శంకరయ్య, కిషన్, శ్రీనివాస్, అనంతరావు, గంగాధర్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తొలగించరా?


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

బెజ్జూరు, ఏప్రిల్ 30: బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో డ్రెయినేజీల్లో పూడిక నిండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పూడిక నిండిన కారణంగా డ్రెయినేజీల్లోని మురుగునీరంతా రోడ్లపై ప్రవహించి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ లేక మురుగు నీరంతా రోడ్డు పక్కనే ప్రవహిస్తోంది. అయినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామ స్థులు ఆరోపిస్తున్నారు. గతంలో పలుమార్లు గ్రామపం చాయతీ అధికారులు దృష్టికి సమస్యను తీసుకుపోయినా స్పందించడం లేదని పేర్కొంటున్నారు. ఇళ్ల ముందు మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కాగా సర్పంచుల పదవీ కాలం పూర్తికావడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అయితే ఆ అధికారులు గ్రామాల వైపు వెళ్లకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. అధికా రులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

పది ఫలితాల్లో 'కృష్ణవేణి' విద్యార్థుల ప్రతిభ



జెల్ల ఆర్యన్ (10 జీపీఏ)



శివరాజేష్ (10 జీపీఏ)

కాగజ్‌నగర్, ఏప్రిల్ 30: రాష్ట్ర ప్రభుత్వం మంగళ వారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ర్యాంకులు సాధించారు. పట్టణానికి చెందిన కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు జెల్ల అర్యన్, తస్వీన్ సదాఫ్, శివరాజేశ్ డొంగ్రేకు 10జీపీఏ మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ దోమల సురవర్ధన్ తెలిపారు. ఇదే పాఠశాలలో కోదం విష్ణు ప్రియ, బోనగిరి హసిని, మిట్టపల్లి చందన ప్రియకు 9.8 జీపీఏ మార్కులు సాధించారని చెప్పారు. అలాగే 38 మంది 8 జీపీఏ నుంచి 10 జీపీఏ మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



తస్వీన్ సదాఫ్ (10 జీపీఏ)

'పది' ఫలితాల్లో బాలికలదే హవా

- జిల్లాలో 83.29 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయిలో 31వ స్థానం



ఆసిఫాబాద్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో బాలికలే పైచేయి సాధించారు. మంగళవారం పదో తరగతి ఫలితాలను ప్రభు త్వం విడుదల చేసింది. రాష్ట్రంలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా 31వ స్థానంలో నిలిచింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 32వ స్థానంలో నిలిచిన జిల్లా ఈ ఏడాది ఫలితాల్లో 31వ స్థానానికి చేరుకుం ది. జిల్లా వ్యాప్తంగా 3,008 మంది బాలురు, 3,385 మంది బాలికలు పరీక్షలు రాశారు. మొత్తం 6,393 మంది పదోతరగతి పరీక్షలకు హజరు కాగా ఇందులో 2,366 మంది బాలురు ఉత్తీర్ణత సాధించారు. కాగా 78.66 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 2,959 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించగా 87.42 శాతంగా ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 5,325 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా జిల్లాలో 83.29 ఉత్తీర్ణత శాతం నమోదు చేసుకొని రాష్ట్రంలో జిల్లా 31వ స్థానంలో నిలిచింది. గతేడాది మొత్తం 7,007 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 5,605 మంది ఉత్తీర్ణత సాధించగా 79 శాతంగా ఉత్తీర్ణత నమోదై రాష్ట్రంలో 32వ స్థానంలో నిలిచింది. గతేడాది ఫలితాలతో పోలిస్తే ఈ ఏడాది కాస్తంత మెరుగైన ఫలితాలు సాధించారు.

ఆసిఫాబాద్ రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఆసిఫాబాద్‌లోని మహాత్మజ్యోతిబాపూలే బాలుర పాఠశాలకు చెందిన సత్యనారాయణ 10 జీపీఏ సాధించాడు. అలాగే మోడల్ స్కూల్‌కు చెందిన గుండేటి భావన, మసాదే మనస్విని, సోనులే తీరోజాలు 9.8 జీపీఏలు సాధించారు. సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన పులి హరి జీ, మానెంరాంలు 10 జీపీఏ, అబ్దుల్ కలాం పాఠశాలకు చెందిన జోయా ఆఫ్సీన్ 10 జీపీఏ సాధించారు.



సాయిరాం (10 జీపీఏ)



సత్యనారాయణ (10 జీపీఏ)

వాంకిడి: మండలంలో పదో తరగతిలో 89శాతం ఉత్తీర్ణత సాధించారు.మండలంలో 324 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 288 మం ది ఉత్తీర్ణులు అయ్యాయి. కగా గ్రీన్‌వుడ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన రేవంత్‌సాయి 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలు వగా అదే పాఠశాలకు చెందిన కే. సాత్విక 9 జీపీఏ, వాంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేందిన రాజస్వేతిక 9 జీపీఏ సాధించారు. రేవంత్, సాత్విక, రాజస్వేతికను జడ్పీటీసీ అజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

తిర్యాణి: మండలంలో పదో తరగతి విద్యార్థులు 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 254 మంది విద్యార్థులకు గాను 252 మంది పరీక్ష రాయగా 229 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ పాఠశాలకు చెందిన వైష్ణవి 9.3 జీపీఏ మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

కెరమెరి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 91 శాతం, గోయగాం జిల్లా పరిషత్‌లో 95 శాతం, మోడి ఆశ్రమోన్నత పాఠశాలలో 99 శాతం, మోడి కేజీబీవీలో 95 శాతం, అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో 95 శాతం, హట్టి ఆశ్రమ పాఠశాలలో 100 శాతం,రాంజీగూడ ఆశ్రమ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని మోడి కేజీబీవీకి చెందిన బావ్నె యోగిత 9.0 జీపీఏ మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

సిర్పూర్(టి): టీఎస్‌ఆర్‌డబ్ల్యూఎస్ పాఠశాలకు చెందిన పెరుగుసాయిరాం జీపీఏ 10/10 మార్కులు సాధించగా మానేపల్లి అఖిల సాయి వరప్రసాద్, కుమ్మరి శివకుమార్ జీపీఏ 9.7 మార్కులు సాధించారు. అలాగే సాంఘిక సంక్షేమ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించా రు. ఈడెన్ గార్డెన్ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధిం చారు.

దహెగాం: మండల వ్యాప్తంగా 63.21 శాతం మంది పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 269 మంది పరీక్షలు రాయగా 63.21 శాతం మంది పాసైనట్లు ఎంఈఓ భిక్షపతి తెలిపారు. పార్వతిపేటలోని సెంయిట్ ఫ్రాన్సిస్ పాఠశాలకు చెందిన మహతి 9.3 జీపీఏ మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

బెజ్జూరు: ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వపాఠశాలలు హవా కొనసాగించాయి. మండలంలోని సోమిని గిరిజన పాఠశాలలో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే బెజ్జూరు ఆశ్రమ పాఠశాలలో 97 శాతం, సలుగుపల్లి ఆశ్రమ పాఠశాలలో 9 శాతం,బెజ్జూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 81 శాతం సలుగుపల్లి జిల్లా పరిషత్‌లో 87 శాతం, కేజీబీవీలో 95 శాతం ఉత్తీర్ణత సాధించారు.

చింతలమానేపల్లి: మండలంలో పదోతరగతి పరీక్ష ఫలితాలు మంగళ వారం వెలువడిన నేపథ్యంలో మండలంలో 81.5 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 211 మంది గాను 210 మంది పరీక్ష రాయగా అందులో 172 మంది ఉత్తీర్ణత సాధించారు. బాబాసాగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి ఉప్పులం వైష్ణవి 9.5 జీపీఏ సాధించింది.

పెంచికలపేట: మండలం కేజీబీవీ పాఠశాలకు చెందిన ఆలేఖ్యతో పాటు ఎల్లూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థి నీల్‌కుమార్ పదోతరగతి పరీక్షల్లో 9 జీపీఏ మార్కులు సాధించి మండల టాపర్‌లుగా నిలిచింది. మండలంలో 143 మంది విద్యార్థులకు గాను 129 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

జైనూర్: మండల వ్యాప్తంగా 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో కుడ్మె సుధాకర్ తెలిపారు. 358 మంది విద్యార్థులు పరీక్షల రాయగా 354 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

సిర్పూర్(యు): మండలంలోని మహగాం, పంగడి, కోహినూర్ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని నాలుగు పాఠశాలలో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధిం చడంపై ఎంఈవో కుడ్మేత సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.

అధికారులకు సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 30: లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో పరిస్థితిపై అధికారులకు సమాచారం ఇవ్వాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని ఆసిఫాబాద్, సిర్పూర్‌నియోజక వర్గాల్లో 61 పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి నెట్‌వర్క్ అందుబాటులో లేనందున పటిష్ట పోలింగ్ కేంద్రాలను షాడో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని చెప్పారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్న వైర్‌లెస్ సెట్లపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజున ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతాన్ని పై అధికారులకు తెలియజేయాలని, పోలింగ్ రోజు ఆయా కేంద్రాలలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సెట్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డీపీఓ ఉమర్‌హుస్సేన్, కమ్యూనికేషన్ అధికారి సందీప్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

కౌటాల, ఏప్రిల్ 30: పోలింగ్ కేంద్రాలు గుర్తించిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మే 5వ తేదీలోగా అత్యవసర పనులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం కౌటాల మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కన్నెపల్లి, గురుడుపేట, బెజ్జూరు మండలం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొత్తగూడ, రెబ్బెన ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన సందర్శించి సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖక్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఈవో సోమయ్య, ఎంఈవో రమేశ్ బాబు, ఇంజనీర్లు ప్రవీణ్‌కుమార్, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు చర్యలు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 30: మండలంలోని మారుమూల గ్రామాలకు తాగునీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆసిఫాబాద్ డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని వెంకటాపూర్, బల్హాన్‌పూర్, ఒడ్డెఘాట్ గ్రామాలను సందర్శించారు. ఒడ్డెఘాట్‌లో మే 21 నుంచి 24 వరకు జాతర ఉన్న నేపథ్యంలో జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డీఎల్‌పీఓ దృష్టికి తీసుకు రాగా ట్యాంకర్ల ద్వారా జాతర సమయంలో తాగునీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆయా గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి సూచనలు చేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

రెబ్బెన, ఏప్రిల్ 30: రెబ్బెన మండలం కొండపల్లి గ్రామంలో బాల్య వివాహాన్ని మంగళవారం అధికారులు అడ్డుకున్నారు. మైనర్ అమ్మాయికి వివాహాన్ని నిర్ణయించగా ఈ విషయాన్ని తెలుసుకున్న బాలల సంరక్షణ విభాగం అధికారులు కొండపల్లికి చేరుకున్న బాల్య వివాహంతో కలిగే అనర్థాలను కుటుంబ సభ్యులకు వివరించి పెళ్లిని వాయిదా వేయించారు. ఈ సందర్భంగా డీసీపీవో బుర్ల మహేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అజర్ అలీ, బాల రక్ష భవన్ సిబ్బంది బాల ప్రవీణ్ కుమార్, చంద్రశేఖర్, డోంగ్రిప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కార్డన్‌సెర్చ్



లంబాడీహెట్టిలో స్వాధీనం చేసుకున్న గుడుంబా

చింతలమానేపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని లంబాడీహెట్టి, గుప్పగూడె గ్రామాల్లో మంగళవారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదీక్ పాషాల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారు చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు, టీఎస్‌పీఎస్ పోలీసులు పాల్గొన్నారు.

ఎంపీపీగా బాధ్యతల స్వీకరణ

సిర్పూర్(టి), ఏప్రిల్ 30: సిర్పూర్(టి) ఎంపీపీగా ఈర్ల సత్యనారాయణ మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వుల ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టారు. సిర్పూర్(టి) మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న సత్యనారాయణ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ సువర్ణపై సభ్యులు గతంలో అవిశ్వాసం పెట్టగా నెగ్గింది. దీంతో ఆమెను ఎంపీపీగా తప్పిస్తూ ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీచేయగా ఆ స్థానంలో వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న ఈర్ల సత్యనారాయణను ఎంపీపీగా ప్రకటించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ ఎంపీపీకి పుష్పగుచ్చం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, నాయకులు కిశోర్, అఖిల్, మోహిజ్ అహ్మద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్

వాంకిడి, ఏప్రిల్ 30: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు కార్యకర్తలు ప్రజలుల్లోకి వెళ్లి కేంద్ర పథకాలను వివరించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులను, గ్రామ పటేళ్లను బీజేపీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో ఆసిపాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు కోట్నక విజయ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సుచిత్, నాయకులు విశాల్, దుర్గం ఆర్థిక, సదాశివ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 30: జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు చెందిన బీఆర్‌ఎస్ మాజీ వార్డు సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంగళ వారం జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్‌లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు విశాల్, విలాస్, స్వామి, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో క్రీడా క్యాంపులు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 30: జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 11 క్రీడలకు సంబంధించి సమ్మర్ క్రీడా క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో ఆర్ రమాదేవి తెలిపారు. ఈ క్యాంపు మే 1 నుంచి 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. యువత క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం

జైనూర్, ఏప్రిల్ 30: మండలంలోని మార్లవాయిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజును బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, ఆ పార్టీ నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దౌలత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం

రెబ్బెన, ఏప్రిల్ 30: ఖైరిగూడ ఓపెన్ కాస్టులో పదవీ విరమణ పొందిన హెచ్‌ఈఎంఎం సెక్షన్ జనరల్ మజ్దూర్ పాషాను మంగళవారం ఏఐటీయూసీ ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పాషా విధులు నిర్వహించి మంగళవారం పదవీ విరమణ పొందినట్టు తెలిపారు. ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని చెప్పారు. ఉద్యోగులు పని చేసిన కాలంలో చేసి సేవల వల్లే గుర్తంపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు కిరణ్, మీస చంద్రశేఖర్, శేషశైనా రావు, దేవర కొండ దివాకర్, కృష్ణమోహన్, షిఫ్ట్ ఇన్‌చార్జీ ఎండీ షకీల్, నరేష్, తిరుపతి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తన నియమావళి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలోని కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణులతో కలిసి ప్రజాప్రతినిధులతో కలెక్టర్ వెంకటేష్ దోత్రే సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో సాగేలా రాజకీయ పార్టీలు సహ కరించాలని తెలిపారు. సభలు, సమావేశాలు నిర్వహణ అనుమతుల కోసం సువిధ యాప్‌లో 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికే అవకావం ఉంటుందన్నారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిస్టిక్స్ సర్వేలెయన్స్ టీం విడతల వారిగా విధులు నిర్వహిస్తున్నాయని వీడియో తీసిన అనంతరం వ్యూయింగ్ తరువాత అభ్యర్థుల ఖర్చుల వివరాలు అభ్యర్థులకు వెళ్తాయని అన్నారు. పార్లమెం ట్ పరిధిలో 12 మంది అభ్యర్థులు ఉన్నారని, హోం ఓటింగ్ కోసం సిర్పూర్‌నియోజక వవర్గంలో 128 మంది, ఆసిఫాబాద్ నియోజక వవర్గంలో 29 మంది వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్, తహసీల్దార్ దేశ్‌పాండే, సూపరింటెండెంట్ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య ప్రణాళిక అధికారి సేవలు అభినందనీయం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 30: ముఖ్య ప్రణాళిక అధికారి బంగారి రవీందర్ సేవలు అభినందనీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ముఖ్య ప్రణాళికాధికార పదవీ విరమణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివార, దాసరి వేణులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీందర్ ముఖ్య ప్రణాళిక అధికారిగా మూడు సంవత్సరాల రెండు నెలల పాటు జిల్లా అభివృద్ధిలో కీలకంగా ఉండి సేవలందించారని కొనియాడారు. అనంతరం సీపీవో దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఈఓ రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి

జైనూర్, ఏప్రిల్ 30: మండలంలోని పానాపటార్, మర్కగూడ(జి), మర్కగూడ(కె), తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల, ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, ఎంపీపీ కుంర తిరుమల, మార్లవాయి ఉప సర్పంచ్ సావిత్రిబాయి, నాయకులు పెందుర్ లక్ష్మణ్, మేస్రాం దేవరావ్, మేస్రాం మక్కు, మేస్రాం చిత్రు, కుంర దేవరావ్, మాజీ ఎంపీపీ అనక కలాబాయి, మాన్కుబాయి, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని నేట్నూర్, కోడిగూడ, చిల్కాగూడ తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకకులు ఇంటింటికీ వెళ్లి పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు కారు గుర్తు ఓటు వేసి గెలిపించాలని కోరారు.బి ఆర్క నాగోరావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు.

జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 31: శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా మే 1 నుంచి 31 వరకు 30 పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున డీఎస్పీ లేదా పోలీసు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేకుండా సమావేశాలు, ఊరే గింపులు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించకూడదని చెప్పా రు. లౌడ్ స్పీకర్లు, డీజేలు వంటివి నిషేధమని, అనుమ తులు లేకుండా ర్యాలీలు చేపడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మేడే పోస్టర్ల ఆవిష్కరణ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 30: ఆర్‌కె 7 గని ఆవరణలో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మే డే పోస్టర్లను యూనియన్ ప్రధాన కార్యదర్శి మణిరామ్‌సింగ్ ఠాకూర్, ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించిందన్నారు. దీనివల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. 8 పనిగంటలకు బదులుగా 12 పని గంటలు అమలవుతాయని, ఇది కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన వ్యవహారమని చెప్పారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి హక్కు లను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి హసన్, బొల్లు మల్లయ్య, జి. తిరుపతి, డి. చంద్రమౌళి, నవీన్ కుమార్, పాండే, ఖాసిం, పంబాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శాంతిఖని గనిపై మంగళవారం టీఎన్‌టీయూసీ నాయకులు మే డే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ మాట్లాడుతూ మే 1 న జరిగే మే డే వేడుకల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, హసన్, మల్లయ్య, తిరుపతి, చంద్రమౌళి, నవీన్‌కుమార్, ఖాసీంబాయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వీట్ల పంపిణీ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 30: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో మేడేను పురస్కరిం చుకొని అధికారులు, సిబ్బందికి ఏఐటీయూసీ నాయకులు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి మాటాడుతూ, ఏరియా కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం ఆఫీస్ పిట్ కార్యదర్శి గొల్లపల్లి రాంచందర్, సహాయ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు పెంచడమే ధ్యేయం



మాట్లాడుతున్న రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 30: తెలంగాణలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరే ణి సంస్థలో నూతన గనులను ఏర్పాటు చేయిస్తామని, ఉపాధి అవకాశాలు పెంచడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం యోచిస్తోందని రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. మందమర్రిలోని మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు నివాసం వద్ద మంగళవారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినప్పుడు అప్పటి ప్రధానితో మాట్లాడి సింగరేణికి 400 కోట్ల పెట్టుబడులు పెట్టించిన ఘనత ఐఎన్‌టీయూసీదేనని తెలిపారు. ఐదో వేజ్‌బోర్డు ఏడు సంవత్సరాలు అయితే కార్మికులు 23 రోజులు సమ్మె చేసి జైలుకు వెళితే రూ. 1200 కోట్లు ఇప్పించిన ఘనత తమ యూనియన్‌దేనని తెలిపారు. కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ విప్ నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్మన్ భాగ్యలక్ష్మీఓదెలు, ఐఎన్‌టీయూసీ నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్, కాంగ్రెస్ నాయకులు నరేష్, రమేష్, తిరుమల్, అర్జున్‌కుమార్, రాజు, నర్సింగ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

- **జనక్ ప్రసాద్‌కు సన్మానం**

మందమర్రిటౌన్, ఏప్రిల్ 30: రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌ను సోమవారం జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఓదెలు ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలోని 2వ జోన్‌లోని చైర్‌పర్సన్ నివాసం వద్ద జనక్ ప్రసద్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు నాయకులు కాంపెల్లి సమ్మయ్య, భూమయ్య, రాంశెట్టి నరేందర్, నరేష్ , రమేశ్, బాస్కర్, లక్ష్మణ్, నర్సింగ్, జావేద్‌ఖాన్, ఇసాక్, తిరుమల్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 30 : వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు అన్నారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు 25 రోజుల పాటు ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్ బాల్ క్రీడాంశాలలో నిపుణులు శిక్షణ ఇస్తారని తెలిపారు. చిన్నారులు శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల ప్రయోజనాల కోసం యాజమాన్యం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్మికుల పిల్లలు క్రీడల్లో రాణించడం ద్వారా గుర్తింపు పొందే అవకాశం ఉటుందని, ఇది ఉద్యోగాల్లో సైతం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ తోట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీకి రాజీనామా

శ్రీరాంపూర్, ఏప్రిల్ 30: ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సమ్ము రాజయ్య తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూనియన్ బలోపేతానికి తాను శాయాశక్తుల పని చేశానని తెలిపారు. గత ఐదేళ్లలో యూనియన్‌లో ఉన్న నాయకులు వారి స్వార్థ విధానాలతో ఐఎన్‌టీయూసీకి తీవ్ర నష్టం చేశారని అన్నారు. ఇటీవల గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికుల మనోభావాలను పరిగణలోకి తీసుకోలేదన్నారు. దీనివల్ల సింగరేణి వ్యాప్తంగా ఎక్కువ ఏరియాలు గెల్చుకొని, శ్రీరాంపూర్‌లో ఓడిపోయిందని చెప్పారు. ఫలితంగా గుర్తింపుసంఘంగా అవతరించలేక చతికిలబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నాయకులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.